క్లుప్తంగా

సుస్థిర లక్ష్యాలపై రేపు సమీక్ష

శావల్యాపురం: ఈనెల 11న వినుకొండ పట్టణంలో నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, వలంటీర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య గురువారం తెలిపారు. అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వర్సిటీకి రూ.2.5లక్షల వెండి క్రీడా ట్రోఫీ

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో భాగంగా పురుషుల సాఫ్ట్‌బాల్ విజేతకు బహూకరించేందుకు మేదరమెట్ల అంజమ్మ మస్తాన్‌రావు మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో దాదాపు రూ.2.5లక్షల విలువైన వెండి ట్రోఫీని వర్సిటీకి అందజేయనున్నట్టు సొసైటీ చైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు గురువారం తెలిపారు. దాదాపు మూడు కేజీల వెండితో చెన్నైలో ట్రోఫీని ప్రత్యేకంగా తయారు చేయించినట్టు వివరించారు. వర్సిటీ పరిధిలో 60 క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తుండగా, 19 క్రీడలకు మాత్రమే ట్రోఫీలు ఉన్నాయనీ, తాము 20వ ట్రోఫీని వర్సిటీకి అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది సాఫ్ట్ బాల్ విజేతకు ట్రోఫీని వర్సిటీ అందిస్తుందని, ఏడాది పాటు విజేత కళాశాలలో ట్రోఫీ ఉంటుందనీ, మరుసటి ఏడాది విజేతకు ట్రోఫీ బదిలీ అవుతుందని వివరించారు. కాగా, ఈనెల 24, 25 తేదిలలో వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ఈపూరు మండలం ముప్పాళ్లలోని ధన లక్ష్మీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విజేతలకు మొదటిసారిగా ట్రోఫీని అందించనున్నట్టు తెలిపారు.

రేషన్ డీలర్‌పై 6ఎ కేసు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో 11వ నెంబరు రేషన్ దుకాణంపై సివిల్ సప్లయీస్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి, రేషన్ డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తెలిపిన వివరాల మేరకు నాదెండ్ల 11వ నంబరు రేషన్ షాపుపై మంగళవారం కార్డుదారుల నుంచి ఫిర్యాదు అందింది. జిల్లా సివిల్ సప్లయీస్ అధికారుల ఆదేశాల మేరకు సీఎస్ డీటీ కొండారెడ్డి తనిఖీ చేయగా సుమారు 15 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉన్నట్లు తేలింది. రికార్డుల్లోని నిల్వల కన్నా అధికంగా ఉండటంతో 6ఎ కేసు నమోదు చేశారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. స్వాధీనం చేసుకున్న 15 క్వింటాళ్ల బియ్యాన్ని నాదెండ్ల వీఆర్‌ఓ చైతన్యకు అప్పగించారు.

క్యాటిల్ అండర్‌పాస్ కావాల్సిందే

నాదెండ్ల: చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు గణపవరం – అప్పాపురం డొంక రోడ్డులో క్యాటిల్ అండర్‌పాస్ కావాలంటూ ఇటీవల నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు చెందిన ప్రాంతీయ అధికారిని కోరిన విషయం విధితమే. దీంతో ఆ శాఖ ఇంజినీర్ వెంకటసోమరాజు గురువారం బైపాస్ పనులు పరిశీలించి అనంతరం రైతులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో అండర్‌పాస్ లేకుంటే పలు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. సర్వీసు రోడ్డుకు గోడ నిర్మించే విషయంపై ప్రస్తావించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

థామస్ మృతికి ఆక్టా సంతాపం

నరసరావుపేట ఈస్ట్: కళాశాల విద్యా కమిషనరేట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జె.హెన్రీ థామస్(55) ఆకస్మిక మృతిపై అఫిలియేటెడ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఆక్టా) రాష్ట్ర అధ్యక్షుడు కొండ్రు మోహనరావు గురువారం తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురువారం తెల్లవారుజామున థామస్ ఆకస్మిక మరణవార్త తనను కలచివేసిందని తెలిపారు. కళాశాలలో ఆయన చిత్రపటం వద్ద ఆక్టా ప్రతినిధులు నివాళులర్పించారు. ఆక్టా అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఆఫీస్ అండ్ పబ్లికేషన్ సెక్రటరీ ఐ.సదాశివరెడ్డి, కళాశాల ఆక్టా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న కారు

ఎయిర్ బెలూన్లు తెరుచుకోవటంతో దంపతులకు తప్పిన ప్రాణాపాయం

నాదెండ్ల: గుంటూరు – కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు పెట్రోల్ బంకు సమీపంలో ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ఘటనలో కారులోని ఎయిర్‌బెలూన్లు ఓపెన్ కావటంతో ప్రాణాపాయం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గుంటూరు మీదుగా విజయవాడ వెళ్లాల్సి ఉంది. ఇదే సమయంలో గుంటూరు వైపు నుంచి నరసరావుపేటకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ కారులో ప్రయాణిస్తున్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి చెందిన దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవటంతో ప్రాణాపాయం తప్పింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

దళితులు రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలి

నరసరావుపేట: దళితులు రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరమేశ్వర్ అన్నారు. రాజ్యాధికార బస్సుయాత్ర గురువారం నరసరావుపేటకు చేరుకుంది. జిల్లా అధ్యక్షుడు బూదాల బాబూరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హర్డు హైస్కూలు ఆవరణలో బహిరంగ సభ నిర్వహించారు.

గడప గడపలో సంక్షేమ కాంతులు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- బోయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



బోయపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు గడగడపకు చేరుతూ ప్రతిఇంట సంక్షేమం విరాజిల్లుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. బోయపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. మూడోరోజు గురువారం జెండాచెట్టు వద్ద కొబ్బరి కాయకొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మసీదు బజారు, ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. ప్రతి వీధిలోనూ అదే ఆదరణ చూపుతూ.. ప్రతిఇంటి వద్ద కళ్లలో ఆనందంతో లబ్ధిదారులు మంత్రి రజినిని ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలు ఆర్థిక అభ్యున్నతిని సాధిస్తున్నాయంటూ అంతటా మహిళలు మంత్రితో చెప్పారు. పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి వైఎస్సార్ సీపీ మూడున్నరేళ్ల కాలంలో ప్రజలకు అందించిన లబ్ధి వివరాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. వ్యక్తిగత, సామాజిక పరమైన సమస్యలు ఇంకా ఏవైనా ఉంటే తనదృష్టికి తీసుకురావాలంటూ మంత్రి రజిని స్థానిక ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. అయినా టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే వస్తారని, వారి మాయమాటలు నమ్మవద్దని సూచించారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని కాంక్షించే జగనన్నకు అందరూ మద్దతునిచ్చి మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైఎస్ చైర్మన్ మానుకొండ వీరారెడ్డి, ఎంపీపీ పిడతల ఝాన్సీ, పార్టీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, రాచమంటి చింతారావు, గ్రామ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు, వంకధారి శ్రీనుబాబు, వీరయ్య, శ్రీనివాసనాయక్, శేఖర్ నాయక్, బింజు బుల్లెయ్య, సాంబశివరావు, షేక్ హుస్సేన్, మోధిన్‌బాషా, మస్తాన్‌వలి, చిన్నమస్తాన్, రహంతుల్లా, ఫారుఖ్, హజరత్‌వలి, పల్లపు రవి, షేక్ ఖాదర్‌బాషా, అల్లాబక్షు(బుజ్జి) వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని 16,17 వార్డుల్లోని మక్కెన నగర్, ఇస్లాంపేట, నమాజ్‌కుంట ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను తెలియజేశారు. వార్డుల్లో పర్యటన సందర్భంగా ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారిందని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అలాగే మక్కెన నగర్‌లో సైడ్ డ్రెయిన్స్ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్న సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే త్వరలోనే డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందనివారి సమస్యను గుర్తించి పథకాలు వచ్చేలా వలంటీర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో ఎటూ చూసినా 15 కిలోమీటర్ల మేర అభివృద్ధి జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో ఇంటింటికి తిరిగి పథకాలు రానివారిని గుర్తించి వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వినుకొండను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్‌ఖన్నా, జడ్పీటీసీ విజయలక్ష్మిరాజా, వార్డు కౌన్సిలర్లు సానాల పుల్లయ్య, సుభాని, పాపసాని బ్రహ్మయ్య, షకీలా దస్తగిరి, సైదా, పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్, జడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్‌లతో పాటు మున్సిపల్ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

హుదా సొసైటీ సేవలు ఎంతో విలువైనవి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



పేదలకు దుప్పట్లు, నగదు పంపిణీ చేస్తున్న మంత్రి రజిని

చిలకలూరిపేట: హుదా సొసైటీ సేవలు ఎంతో విలువైనవని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని గుర్రాల చావిడి సెంటర్లో హుదా సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు, ఆర్థికసాయాన్ని 500 మందికి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి విడదల రజిని మాట్లాడుతూ హుదా సొసైటీ అధ్యక్షుడు అబ్బాస్‌ఖాన్ ఆధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక సేవలో ముందుంటారని కొనియాడారు. సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాల నిర్వహణతో పాటు నిరుపేదలకు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ వంటి కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తుంటారని చెప్పారు. ఆధ్యాత్మిక సేవల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మసీదుల నిర్మాణం చేపడుతున్నారని ఇది ఎంతో పుణ్య కార్యమని వెల్లడించారు. సొసైటీ ఆధ్వర్యంలో ఇలాంటి సేవలు భవిష్యత్తులో ఎన్నో కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హుదా సొసైటీ అధ్యక్షుడు మౌలాన అబ్బాస్‌ఖాన్‌నద్వీ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మాజీ కౌన్సిలర్లు సయ్యద్ బషీర్‌మేస్త్రీ, షేక్ కరిముల్లా, యార్డు డైరెక్టర్ షేక్ అబ్దుల్‌గని, పఠాన్ చినషబ్బీర్ పాల్గొన్నారు.

సెలవులు ఎస్‌ఆర్‌లో నమోదు చేయించండి



నరసరావుపేట: అన్నీ రకాల సెలవులు ఎస్‌ఆర్‌లో నమోదు చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డి.రవీంద్రకు గురువారం వినతిపత్రం సమర్పించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఉద్యోగులకు రావాల్సిన సెలవులు అన్నింటినీ నమోదు చేపిస్తామని హామీ ఇచ్చారు. నరసరావుపేట ఎన్‌జీఓ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, సెక్రటరీ ఆనంద్‌నాథ్, ఉపాధ్యక్షుడు రవికుమార్, ఈసీ మెంబర్ అల్లభక్షు, జిల్లా గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు జగదీష్ బాబు, లవబాబు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, టీడీపీ నేత లోకేష్‌కు మధ్య నక్కకి నాగలోకానికి ఉన్న తేడా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర ప్రచారం తమ పార్టీకే లాభిస్తుందన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేశారన్నారు. వలంటీర్లు ఇంటింటికి తిరిగి వృద్ధులు మొదలు యువకుల వరకు సమస్యలను పరిష్కరించటంలో సేవలు అందజేయటంలో ముందున్నారన్నారు. గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు, పట్టాలను పంపిణీ చేశారు. రూ.22లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, గడ్డం వెంకటరావు, గుండాల వెంకటేష్, పడాల శివారెడ్డి, కల్లం శివారెడ్డి, గ్రామ ఎంపీటీసీ మోతుకూరి వెంకటేష్, సర్పంచు ఇర్లా వెంకటరత్నం, బండారు కొండలు, చీమల శ్రీనివాసరెడ్డి, పోతులూరి సుబ్బారెడ్డి, దేవళ్లశ్రీనివాసరావు, బత్తుల రామకృష్ణ అధికారులు పాల్గొన్నారు.

పీఎం సురక్ష మాతృత్వ సేవలను పెంచాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి



వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి

శావల్యాపురం: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకం అమలు వేగవంతం అయ్యేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.శోభారాణి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలను ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించి సమగ్ర వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. రక్తహీనత లోపంతో బాధపడే గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు నిరంతరం అందించటం పాటు నియంత్రణకు క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రక్తహీనతలో భాగంగా హిమోగ్లోబిన్ 11 శాతం లోపు ఉన్న గర్భిణులు ఎనిమియా వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. మొదట కాన్పు జరిగే గర్భిణులకు ప్రధానమంత్రి మాతృత్వ వందన పథకంలో రూ.7వేలు నగదు తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు జరిగేలా వైద్య ఆరోగ్య సిబ్బంది చూడాలన్నారు. అనంతరం గర్భిణులతో మాట్లాడి వైద్య పరీక్షలు స్వయంగా పరిశీలించి రికార్డులు తనిఖీ చేసి వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆమెతో పాటు వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, స్టాఫ్‌నర్సులు బాలిబోయిన లక్ష్మిప్రసన్న, ప్రమీల, సూపర్‌వైజరు ఉమాదేవి, ఫార్మాసిస్ట్ లక్ష్మీనారాయణ, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

మట్కా కేసులో నలుగురు అరెస్ట్

నరసరావుపేటటౌన్: మట్కా, జూదం నిర్వహిస్తున్న నలుగురుని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6,100 స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. ఏరియా వైద్యశాల వద్ద మట్కా, జూదం నిర్వహిస్తున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ జూదానికి పాల్పడుతున్న నలుగుర్ని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్

నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

రొంపిచర్ల: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో బుధవారం రాత్రి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలోకి వచ్చిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి నాయీ బ్రాహ్మణులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో గల ప్రముఖ దేవాలయాల ఆలయాల కమిటీలలో నాయీబ్రాహ్మణులను బోర్డు సభ్యులుగా నియమించాలని జీవో జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలుపుతూ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీసీలు అంటే వెనుకబడిన తరగతులకు చెందిన వారని కాకుండా సమాజానికి వెన్నెముక లాంటి వారని తెలియజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి కొరకు పాటుపడుతున్న తమ పార్టీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం నాయీ బ్రాహ్మణులు శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం నియోజకవర్గ నాయకుడు అట్లూరి బాలసుబ్రహ్మణ్యం, మండల నాయకులు ముక్కడాల వెంకటేశ్వరరావు, ముక్కడాల రాము, వీరనారాయణ, భూషయ్య, వీఆర్‌ఓ పడాల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు చపారపు సంజీవరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పడాల హనిమిరెడ్డి పాల్గొన్నారు.

15 లోపు తిరునాళ్ల ఏర్పాట్లన్నీ పూర్తిచేస్తాం

విలేకర్లతో ఆర్డీఓ, డీఎస్పీలు

నరసరావుపేట: కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం గతేడాది కంటే ఈ ఏడాది ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్డీఓ మర్రి శేషిరెడ్డి, డీఎస్పీ సి.విజయభాస్కరరావు వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆర్డీఓ శేషిరెడ్డి మాట్లాడుతూ ఏర్పాట్లపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రెండుసార్లు సంబంధిత అధికార్లతో సమీక్ష చేశారన్నారు. వచ్చే సోమవారం మూడో సమీక్షా సమావేశం నిర్వహించబోతున్నామన్నారు. పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయటం జరుగుతుందన్నారు డార్మెటరీ, అన్నదాన సత్రం కొండ దిగువన పూర్తయిందన్నారు. తాటాకుతో వేస్తున్న షెడ్లు పూర్తికాగా, రేకుల షెడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. మెట్లు పని నాలుగైదురోజుల్లో పూర్తవుతాయన్నారు. ఘాట్‌రోడ్డులోని చిన్నపిల్లల పార్కులో పనులు చకా చకా జరుగుతున్నాయన్నారు. ఆర్‌అండ్‌బీ, ఫారెస్టు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అన్నీ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. ఈనెల 15వతేదీ డెడ్‌లైన్‌గా భావిస్తూ పనులు చేయిస్తున్నామన్నారు. డీఎస్పీ విజయభాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్న తిరునాళ్లకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది భక్తులు హాజరవుతారన్నారు. బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలపై జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఇప్పటికే మూడుసార్లు కొండను విజిట్‌చేసి సూచనలు చేయటం జరిగిందన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ జామ్‌గాకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారన్నారు. భక్తులు కొండపైకి వెళ్లి ప్రశాంతంగా దర్శనం చేసుకునేందుకు డబుల్ బారికేడ్లు కట్టిస్తున్నామన్నారు. విద్యుత్ ప్రభలు 70అడుగులకు మించకుండా నిర్మించుకోవాలని సూచిస్తామన్నారు.

చేరుకోవాల్సిన మార్గాలు...

నరసరావుపేట నుంచి కొండకు, కొండ నుంచి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు పలు నూతన మార్గాలను ఏర్పాటు చేశామన్నారు. నరసరావుపేట నుంచి యల్లమంద మీదుగా వచ్చే వాహనాలు, ప్రభలు వయా నర్సరీ మీదుగా కొండకు చేరుకునేవిధంగా ఏర్పాటు చేశామన్నారు. తిరిగి నరసరావుపేట వైపునకు వచ్చే వారందరూ యాదవసత్రం పక్కగుండా గోవిందాపురం కెనాల్‌మీదుగా రావాల్సి ఉంటుందన్నారు. వినుకొండ వైపునకు వెళ్లే వాహనాలు కొండకావూరు, పమిడిమర్రు గ్రామాల మీదుగా వెళ్లేందుకు నూతన రోడ్డు వేస్తున్నారన్నారు. ప్రకాశం జిల్లా నుంచి వచ్చే ట్రాఫిక్‌ను యూటీ జంక్షన్‌మీదుగా వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్‌కు అవకాశం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ కొండవద్ద నిర్మిస్తున్న రోడ్లకోసం రూ.4కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితో చేపట్టిన పనులు ఈనెల 14వ తేదీ నాటికి పూర్తిచేస్తామన్నారు. యల్లమంద వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంలో భూగర్భంలో రాయి పడటంతో ఆలస్యమైందని, ప్రత్యామ్నాయంగా బీటీరోడ్డు వేస్తున్నామన్నారు. దీని వలన ప్రభలు, వాహనాల రాకపోకలకు ఎటువంటి అసౌకర్యం ఉండదన్నారు. సమావేశంలో రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను ఉపయోగించుకోవాలి


రొంపిచర్ల: వ్యవసాయంలో సాంకేతికతను ఉపయోగించుకొని యాజమాన్య పద్ధతులను పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మునమాక గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పైర్లకు రసాయనిక మందులు పిచికారీ చేయడంపై రైతులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. రైతుల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. డ్రోన్ సహాయంతో పురుగుమందులు పిచికారీ చేయడం వల్ల రసాయనాలు తక్కువ మోదాతులో వినియోగించవచ్చన్నారు. పిచికారి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. అనంతరం డ్రోన్ ద్వారా మందుల పిచికారీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నరసరావుపేట ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, రొంపిచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, డీడీవో శివకుమారి, ఏడీఏలు పి.మస్తానమ్మ, శివకుమారి, మండల వ్యవసాయ అధికారులు విజయభాస్కర్, నరేంద్రబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మస్తాన్‌వలి, సైకం సత్యనారాయణరెడ్డి, కోడూరి వెంకటేశ్వర రెడ్డి, గాదె రామిరెడ్డి, పోతులూరి సుబ్బారెడ్డి, వెంకటప్పారెడ్డి, పలు గ్రామాల వీపీఏలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బోధన సామర్థ్యాల పెంపుతోనే మంచి ఫలితాలు

జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పులిపాటి శ్రీనివాసరావు

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించటానికి ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పులిపాటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం విద్యాబోధన శిక్షణ కార్యక్రమంలో భాగంగా శావల్యాపురంలో గిరిజన సంక్షేమ, డీపీఈపీ ప్రభుత్వ పాఠశాలలను సందిర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యత కలిగిన గుణాత్మక విద్యను బోధించటంతో పాటు క్రమశిక్షణ ముఖ్యంగా నేర్పించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు పరిశీలించారు. మధ్యాహ్నభోజన పథకం అమలు తీరు స్వయంగా పరిశీలించి మెను ప్రకారం అమలు జరిగేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని సూచించారు.

వేదసంస్థ డైరెక్టర్ యోహోయాకిన్ మృతి



యెహోయాకిన్(ఫైల్)

చిలకలూరిపేటటౌన్: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని వేద సంస్థ డైరెక్టర్ శ్రీగిరి యోహోయాకిన్ (62) గుండెపోటుతో మృతి చెందారు. ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు డాక్టర్ జాన్‌డేవిడ్ మూడో కుమార్తె పెర్సిస్వరూప భర్త అయిన శ్రీగిరి యోహోయాకిన్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. బుధవారం రాత్రి తీవ్రమైన గుండెపోటు రావడంతో కోకాపేటలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందారు. దంపతులిద్దరూ వేదసంస్థ డైరెక్టర్లుగా ఉండి పట్టణంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. యోహోయాకిన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ కుమార్‌కంటి మహంతి, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లగా ఆమె సోదరుడు జెస్పీ బర్నబాస్ మాత్రం అమెరికాలో ఉన్నారు. ఏఎంజీ, ఫార్ కార్నర్స్, వేదసంస్థల సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి లోనై, ఆయనకు సంతాప సూచకంగా వారి విద్యసంస్థలకు సెలవు ప్రకటించారు.